


వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామ పరిధిలో ఏజీసీ కెనాల్ వద్ద వేంచేసియున్న గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. తూర్పు కెనాల్‌కు 280 క్యూసెక్కులు వదిలారు.



గోపయ్య, లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం

మాదల(ముప్పాళ్ల): మండలంలోని మాదల గ్రామంలో గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

న్యూస్‌రీల్

కనకదుర్గ అమ్మవారికి మంగళ స్నానం



మంగళగిరి టౌన్: మాఘమాసం సందర్భంగా మంగళగిరి నగరపరిధిలో బైపాస్ రోడ్‌లో వేంచేసి యున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో మంగళవారం 108 బిందెలతో ప్రత్యేక మంగళస్నానం నిర్వహించారు. భక్తులు భారీగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. విశేష పూజలు చేశారు. మాఘమాసంలో వచ్చే మంగళవారం అమ్మవారిని పూజిస్తే సకల సంతోషాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఆలయంలో త్రిశూలం ఆకారంలో ముగ్గు వేసి చుట్టూ ప్రత్యేకంగా దీపాలతో అలంకరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రచారానికి ఎంసీఎంసీ అనుమతి అవసరం

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ప్రింట్, ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా ప్రచారం చేసుకునేందుకు అనుమతులను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి పొందాలని అధికారులు మంగళవారం తెలిపారు. దరఖాస్తులను ఎంసీఎంసీ నుంచి పొందవచ్చన్నారు. ప్రీ సర్టిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను కమిటీ పరిశీలించి నిర్ణీత గడువు లోపు అనుమతులు మంజూరు చేస్తుందని వివరించారు.

ఘనంగా తాళ్లమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం

నగరం: మండలంలోని ధూళిపూడి గ్రామంలో వేంసేసి ఉన్న శ్రీతాళ్లమ్మ, వీరమ్మ, పేరంటాళ్ల, చింతయ్యస్వామి దేవస్థాన తిరునాళ్ల మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లను పురస్కరించుకుని శ్రీ తాళ్లమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు చేశారు.

యార్డులో 1,45,429 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,43,421 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,45,429 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,800 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.9,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.9,500 నుంచి రూ.9,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 75,679 బస్తాలు నిల్వ ఉన్నాయి.

టీడీపీ నేతల ఎన్నికల కోడ్ ఉల్లంఘన

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన దళిత బాలిక పేరుపోగు శైలజ గత ఏడాది జులై 15వ తేదీన హత్యకు గురైంది. ఆ బాలిక కుటుంబానికి ప్రభుత్వం రూ.మూడు లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించింది. మంగళవారం పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ నేరుగా బాలిక తండ్రి పేరుపోగు దావీద్‌కు చెక్కు అందజేశారు. మరి కొంతమందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు, కొత్తరెడ్డిపాలెం, చేబ్రోలు ప్రాంతాలకు చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల వేళ చెక్కులు పంపిణీ

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంది. దీనిని ఉల్లంఘిస్తూ చెక్కులను అందజేయటంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సుద్దపల్లి గ్రామానికి చెందిన వెలగా నరేష్ కుమార్‌కు రూ.1,45,329, వేజండ్ల గ్రామానికి చెందిన యార్లగడ్డ ధనలక్ష్మికి రూ.53,500, గొడవర్రు గ్రామానికి చెందిన పి.కోటేశ్వరరావుకు రూ.36,250 చెక్కులను ఎమ్మెల్యే నరేంద్రకుమార్ అందజేశారు.

ఆలపాటికి ఎదురుగాలి

సొంత పార్టీ క్యాడర్ నుంచే సహాయ నిరాకరణ

పొన్నూరులో సహకరించని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర

- ఉమాను రంగంలోకి దింపిన అధిష్టానం
- పెదకాకాని, పొన్నూరుల్లో సమావేశాలు
- హాజరు కాకుండా వెళ్లిపోయిన నరేంద్ర
- తెనాలిలో మంత్రి నుంచీ సహకారం శూన్యం
- గుంటూరు నగరంలోనూ ఇదే పరిస్థితి
- మరో అధికార కేంద్రంగా మారతారనే వ్యతిరేకత

నాదెండ్ల నుంచి సహకారం కరవు

ఆలపాటి రాజా సొంత నియోజకవర్గమైన తెనాలిలో కూడా మంత్రి నాదెండ్ల మనోహర్ నుంచి సహకారం లేదు.

- ఏదో మొక్కుబడిగా కార్యక్రమాల్లో పాల్గొంటున్న మనోహర్.. పూర్తి స్థాయిలో పని చేయడం లేదని తెలుగుదేశం నేతలు చెబుతున్నారు.
- ఇటీవల నియోజకవర్గంలో పర్యటించినప్పుడు ఒక స్కూల్‌లో ఉపాధ్యాయులు ఎక్కువ మంది సెలవులో ఉండటంతో వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి మనోహర్ వెంటనే డీఈవోను ఆదేశించారు. ఈ విషయంలో రాజా జోక్యం చేసుకుని ఏపీటీఎఫ్‌తో స్టేట్‌మెంట్ ఇప్పించి, డీఈవోపై ఒత్తిడి పెంచి చర్యలు తీసుకునే ఆలోచన విరమించేలా చేశారు. దీనిపై మంత్రి మనోహర్‌కు, ఆలపాటి రాజాకు మధ్య అంతరం పెరిగిందని చెబుతున్నారు.
- సొంత జిల్లాలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే కృష్ణాజిల్లాలో నేతలు ఎంతమేరకు సహకరిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.



చేబ్రోలులో తెలుగుదేశం కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి దేవినేని

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు జిల్లాలోని పలుచోట్ల సహాయ నిరాకరణ తప్పడం లేదు. ఎమ్మెల్యేలతోపాటు క్యాడర్ నుంచి కూడా మద్దతు రాకపోవడంతో విజయావకాశాలపై తర్జనభర్జన పడుతున్నారు. ముఖ్యంగా పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర పూర్తిగా దూరంగా ఉండటం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. దీంతో నష్టనివారణకు కృష్ణా జిల్లాకు చెందిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జిల్లా నేత మన్నవ సుబ్బారావులను అధిష్ఠానం రంగంలోకి దింపింది. ఆయన మండలాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి నాయకులను బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. దీన్ని నరేంద్ర వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. బయటవాళ్లు వచ్చి తమ వద్ద సమావేశాలు పెట్టేదేంటని, తమ ఎమ్మెల్యేని కాదని తాము ఏం చేయలేమని స్పష్టం చేస్తున్నట్లు తెలిసింది.

- ఈ నెల 4న పొన్నూరు మండల సమావేశం జరపగా, 10వ తేదీన పెదకాకానిలో నిర్వహించారు. ఈ రెండు రోజులు నరేంద్ర జిల్లాలో అందుబాటులో లేరు.
- మంగళవారం చేబ్రోలు మండల సమావేశాన్ని దేవినేని ఉమా నిర్వహించారు. నరేంద్ర నియోజకవర్గంలోనే ఉండి కూడా హాజరు కాలేదు. దీంతో దేవినేని ఉమా, ఎమ్మెల్యే నరేంద్రను కలిసి చర్చించారు. తమ మధ్య ఉన్న విభేదాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ సమక్షంలోనే తేల్చుకుంటానని నరేంద్ర స్పష్టం చేసినట్లు తెలిసింది.

సంగం డెయిరీ విషయంలోనూ, వ్యక్తిగతంగానూ ఆలపాటి రాజా తనను చాలా ఇబ్బంది పెట్టారని చెబుతూ ఆయనకు ఏ విధంగానూ సహకరించే అవకాశమే లేదని నరేంద్ర తేల్చిచెప్పినట్లు సమాచారం.

- దీంతో దేవినేని ఉమా మళ్లీ సమావేశానికి నరేంద్రతో వస్తానని, అంతవరకూ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కష్టపడాలని నాయకులను కోరినట్లు తెలిసింది.

మిగిలిన ఎమ్మెల్యేలదీ అదే దారి

- గుంటూరు తూర్పు, పశ్చిమ, పత్తిపాడు ఎమ్మెల్యేలు పైకి సహకరిస్తున్నట్లు కనపడుతున్నా లోపల మాత్రం రాజా గెలుపును ఇష్టపడటం లేదు.
- ఆలపాటి రాజా గెలిస్తే గుంటూరు నగరంలో మరో అధికార కేంద్రంగా మారతారన్న భయం వారిని వెంటాడుతోంది. ఇప్పటికే తన సామాజిక వర్గం నేతలందరినీ పిలిపించుకుని తాను గెలిచాక ఏ అవసరం వచ్చినా అండగా ఉంటానని చెప్పి ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. వీరు స్థానిక ఎమ్మెల్యేలను పట్టించుకోవడం లేదు.
- దీంతో రాజా వ్యవహార శైలి పట్ల వారు ఆగ్రహంతో ఉన్నారు. మరోవైపు మేయర్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంతో కార్పొరేటర్లు కూడా రెండు వర్గాలుగా చీలిపోయారు. వీరిలో ఎంత మంది సహకరిస్తారన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది.

జేఈఈ మెయిన్‌లో సత్తా చాటిన జిల్లా విద్యార్థులు



పవన్‌కుమార్‌ను సత్కరించిన ఉదయ్‌కిరణ్, వీరనారాయణ తదితరులు

తెనాలి: జేఈఈ మెయిన్ (సెషన్-1)లో తూనుగుంట్ల వెంకట పవన్‌కుమార్ 99.37 పర్సంటైల్ సాధించడం తెనాలికి గర్వకారణమని వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ అన్నారు. తెనాలి చరిత్రలో ఈ స్థాయి విజయం ఇదే ప్రథమం అని చెప్పారు. వివేక జూనియర్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ విద్యార్థి వెంకట పవన్‌కుమార్‌కు మంగళవారం రాత్రి స్కూలు ప్రాంగణంలో అభినందన సభ నిర్వహించారు. పవన్‌కుమార్, తల్లిదండ్రులు పద్మావతి, వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. డాక్టర్ వీరనారాయణ మాట్లాడుతూ.. సాధారణ పాఠశాలలో టెన్త్‌లో 567 మార్కులు సాధించిన పవన్‌కుమార్ జేఈఈ మెయిన్‌లోని ఫిజిక్స్, కెమిస్ట్రీ, మాథ్స్‌లో 99 శాతం స్కోరు చేయటం గమనార్హమని చెప్పారు. వివేక విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు డాక్టర్ కె.రామరాజు, గుత్తా వెంకటరత్నం, జూనియర్ కాలేజీ సీఈవో రావిపాటి ఉదయ్‌కిరణ్, ఐఐటీ డీన్ ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఎస్వీ బ్రహ్మం, కో ఆర్డినేటర్ సునీల్, అధ్యాపకులు నజీరుద్దీన్, శ్యామ్, మల్లేశ్వరి, బాబూరావు, మురళి, రాంబాబు, ఠాగూర్, రాజేష్, అక్షయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రస్తుతం ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న పవన్‌కుమార్ తొలి ప్రయత్నంలోనే 99.37 పర్సెంటైల్‌ను పొందటం విశేషం. వీరిది చాలా పేద కుటుంబం. పట్టణ మారీసుపేటలో నివాసం. తల్లిదండ్రులు పద్మావతి, వెంకటేశ్వర్లు సుల్తానాబాద్‌లోని పాలిథీన్ కవర్ల తయారీ కంపెనీలో పని చేస్తున్నారు. శాస్త్రవేత్త కావాలన్న ఆకాంక్ష కలిగిన కొడుకు కోసం రోజంతా శ్రమిస్తూ బిడ్డను చదివిస్తున్నారు. తల్లిదండ్రుల కష్టం, కాలేజీ అధ్యాపక బృందం గైడెన్స్, ప్రోత్సాహంతోనే తాను ఈ పర్సంటైల్ సాధించినట్టు పవన్ కుమార్ చెప్పాడు. అడ్వాన్స్ కూడా రాసి, ఐఐటీలో చదివి శాస్త్రవేత్తగా దేశానికి సేవ చేయాలనేది తన లక్ష్యంగా వెల్లడించాడు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఎగ్జిక్యూటివ్ ఏజీఎం దుర్గాప్రసాద్, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్‌లో గుంటూరులోని శ్రీచైతన్య విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారని విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ తెలిపారు. లక్ష్మీపురంలోని శ్రీచైతన్య ప్రధాన క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి నంబూరు హేమంత్ అభిరామ్ 99.98, మహ్మద్ తబిష్ అయ్మాన్ 99.83, బెల్లం రుద్రతేజ 99.81, కుర్రా ప్రేరణ 99.62, కేఎల్ స్వరూప్ 99.48, నల్లపాటి శ్రీకృష్ణ చైతన్య 99.25 పర్సంటైల్ సాధించినట్లు వివరించారు. ఇలా 99కిపైగా పర్సంటైల్ సాధించిన విద్యార్థులు 32 మంది ఉన్నారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయనతోపాటు డీన్ సురేష్, ప్రిన్సిపాల్ బాల సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు అభినందించారు.

'మంటల' కేసు ఛేదనకు సీసీ ఫుటేజీ అడిగాం

- మాజీ సీఎం జగన్ కార్యాలయం సమీపంలో ఇటీవల ఘటన
- భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్న ఎస్పీ



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: ఈ నెల ఐదో తేదీన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యాలయం దగ్గర్లో పూలమొక్కల గార్డెన్‌లో మంటలు వ్యాపించాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడారు. ఈ ఘటనపై సోషల్ మీడియాలో, ఇతరత్రా వాటిల్లో ఫిర్యాదు చేసిన వారికి నోటీసు ఇచ్చామనే వార్తలు వస్తున్నాయని అన్నారు. ఫిర్యాదు చేశాక రెండు విషయాల కోసం నోటీసు జారీ చేశామన్నారు. అందులో సీసీ టీవీ ఫుటేజీ కావాలని, అదే రోజు ఓ సమావేశం జరగ్గా అప్పుడు ఎవరెవరూ వచ్చారు, అక్కడ ఉన్నారనేది తెలుసుకునేందుకు నోటీసు ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే సాధారణంగా ఆధారాలు సైతం అందిస్తారని పేర్కొన్నారు. ఎవరైనా కొట్టారంటే సీసీ టీవీ ఫుటేజీ, వాయిస్ రికార్డ్ తదితర వాటితో ఫిర్యాదు చేస్తారని అన్నారు. ఇతర సీసీ టీవీ కెమెరాలలో ఆధారాలు ఏమీ లభ్యం కాలేదని తెలిపారు. ఘటన జరిగిన దగ్గర్లో రెండు కెమెరాలు ఉన్నాయని, వాటిల్లో ఫీడ్ ఇవ్వాలని అడిగామని చెప్పారు. అక్కడ ఏ వాహనం ఉంది, ఎవరు ఉన్నారనేది తెలుసుకునేందుకు సీసీ టీవీ ఫుటేజీ అడిగినట్లు తెలిపారు. మాజీ సీఎం కార్యాలయం హై సెక్యూరిటీ జోన్ అని, సీసీ టీవీ ఫుటేజ్ పరిశీలించి కేసు త్వరగా దర్యాప్తు చేస్తామని చెప్పారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

విధి నిర్వహణలో అప్రమత్తత ముఖ్యం

నగరంపాలెం: ఈ నెల 12వ తేదీన సీఎం చంద్రబాబు గుంటూరు నగరానికి రానున్న దృష్ట్యా అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. మంగళదాస్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ప్రాంగణం, గ్రీన్ లీఫ్ టుబాకో కంపెనీ ఆవరణలోని హెలిపాడ్ ప్రాంగణం, బందోబస్తు ఏర్పాట్లను సోమవారం జిల్లా ఎస్పీ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విధులు కేటాయించిన ప్రదేశాలకు ముందస్తుగా హాజరవ్వాలని పోలీస్ అధికార, సిబ్బందికి సూచించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పరిసర ప్రాంతాలను జల్లెడపట్టాలని అన్నారు. వీవీఐపీలు వచ్చిపోయే వేళల్లో సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూస్తామని చెప్పారు. అనంతరం హెలిపాడ్ నుంచి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా ఏఎస్పీలు కె.సుప్రజ (క్రైం), రమణమూర్తి (పరిపాలన), ఏటీవీ రవిబాబు (ఎల్‌ఓ), హనుమంతు (ఏఆర్), ఎస్‌బీ డీఎస్పీ బి.సీతారామయ్య, ఇంటెలిజెన్స్, పోలీస్ అధికార సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ని నోటీసులిచ్చినా జరిగిందే చెప్పగలం

- భద్రత పెంచమని అడిగితే నోటీసులు ఇస్తారా?
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు అంకిరెడ్డి



మాట్లాడుతున్న అంకిరెడ్డి రామ నారాయణ మూర్తి

తాడేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయానికి పోలీసులు ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా తమ దగ్గర ఉన్న సమాచారాన్ని మాత్రమే ఇవ్వగలమని, లేని సమాచారం గురించి అడిగితే ఇవ్వలేమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు అంకిరెడ్డి రామ నారాయణమూర్తి అన్నారు. మంగళవారం తాడేపల్లి పోలీసులు ఇచ్చిన నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆయన మాట్లాడుతూ... కూటమి సర్కారు రాగానే గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద ఉన్న సీసీ కెమెరాల పర్యవేక్షణను తొలగించడంతో పాటు చెక్ పోస్టులను తొలగించారని తెలిపారు. ప్రస్తుతం అక్కడ ఉన్న ఒక కెమెరాకు కూడా ఎలాంటి సౌకర్యాలూ లేవని పేర్కొన్నారు. దానికి సంబంధించిన ఫుటేజ్ లేదని, పదే పదే ఆ కెమెరా ఫుటేజ్ కావాలని అడుగుతున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాసం ఒకే చోట ఉన్నాయని, గతంలో బీజేపీ అల్లరి మూకలు వచ్చి చేసిన విన్యాసాలను సెల్‌ఫోన్‌లో వీడియో తీసి పోలీసులకు అందజేశామని చెప్పారు. ఇప్పటి వరకు దానిపై ఎటువంటి విచారణ లేదని, మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా టీడీపీ కార్యకర్తలు కొంతమంది వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి వద్ద రెచ్చగొట్టేలా ప్రవర్తించారని గుర్తు చేశారు. ఆ విషయంపై కూడా ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఈ నెల 5వ తేదీన వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయం వద్ద రోడ్డు వెంబడి ఉన్న పార్కులో మంటలు చెలరేగాయని, అక్కడ ఉన్నవారు ఆర్పారని తెలిపారు. పోలీసులు ముఖ్యంగా ఆ రోజు వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి వచ్చిన వారి వివరాలు అడిగారని, ఆ వివరాలు అందజేశామని పేర్కొన్నారు. రోడ్డు వెంబడి ఉన్న వాహనాల వివరాలు తెలియదని, ఆ రహదారిలో అనేక వాహనాలు వచ్చి వెళుతుంటాయన్నారు. వాటిని మేం గమనించలేదని, వారు అడిగిన అన్ని ప్రశ్నలకు జవాబులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

కల్యాణ వైభోగం

- కనుల పండువగా శ్రీ గోపయ్య, తిరుపతమ్మ కల్యాణ వేడుక
- ఘనంగా ప్రారంభమైన పెద్ద తిరునాళ్ల

పెనుగంచిప్రోలు: రంగురంగుల విద్యుత్ దీపాలు, వివిధ పత్ర, పుష్పాలతో సుందరంగా అలంకరించిన కల్యాణ వేదికపై శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ కల్యాణ వేడుక వైభవంగా సాగింది. ఈ మహోత్సవాన్ని భక్తులు కనులారా తిలకించి పులకించారు. మంగళవారం రాత్రి 9.32 గంటలకు ఆశ్లేష నక్షత్రయుక్త కన్యాలగ్న పుష్కరాంశం నందు భక్తుల జయజయ ధ్వానాల నడుమ కల్యాణోత్సవం జరిగింది. విద్యుత్ దీప కాంతులతో శోభిల్లుతున్న ఆలయ ప్రాంగణం బయట ఖమ్మంనకు చెందిన కళాకారులు ప్రత్యేకంగా నిర్మించిన మండపంలో వేద పండితుల మంత్రోచ్చరణ సాక్షిగా అమ్మవారు, స్వామివార్ల కల్యాణఘట్టం కమనీయంగా సాగింది. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణ పీటలపై శ్రీతిరుపతమ్మ అమ్మవారి వంశీకుల తరపున కొల్లా వెంకట చంద్రమౌళి దంపతులు, గోపయ్య స్వామి వంశీకుల తరపున కాకాని వెంకట శ్రీనివాసరావు దంపతులు, ఆలయ ఈఓ బి.హెచ్.వి.ఎస్.ఎన్.కిషోర్‌కుమార్, నందిగామ ఏసీపీ తిలక్ దంపతులు కల్యాణ కూర్చొని వేడుక జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు విశేషంగా తరలి వచ్చారు. తొలుత ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త భారతీయం సత్యవాణి ప్రవచనం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి కల్యాణ వేడుక ముగిసే వరకూ నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు దంపతులు, ఈఈ ఎల్.రమ, ఏఈఓలు ఉమాపతి, తిరుమలేశ్వరరావు, ఏఈలు రాజు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణాన్ని జరిపిస్తున్న పండితులు



విద్యుత్ దీపాల వెలుగులో కాంతులీనుతున్న తిరుపతమ్మ ఆలయం, పరిసరాలు

వైభవంగా పెద్ద తిరునాళ్ల

శ్రీతిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం 6.08 గంటలకు ఆలయ ఈఓ బి.హెచ్.వి.ఎస్. ఎన్.కిషోర్‌కుమార్, ఈఈ ఎల్.రమ ఆధ్వర్యంలో అఖండజ్యోతి స్థాపన, ప్రత్యేక పూజల అనంతరం దీక్షా స్వాముల తిరుముడి సమర్పణతో ఉత్సవాలను ప్రారంభించారు. శ్రీ స్వయంభూ శంభులింగేశ్వర స్వామి ఆలయంలో తిరుముడి కట్టుకున్న స్వాములు అమ్మ భజనలతో, శరణుఘోషతో అమ్మవారిని దర్శించుకొని తిరుముడి సమర్పించి హోమ గుండంలో తిరుముడిలోని ముద్దర టెంకాయలోని నెయ్యిని సమర్పించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో 30 నామినేషన్లు ఆమోదం

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా , గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లను మంగళవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి , జాయింట్ కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ, డీఆర్‌ఓ షేక్ ఖాజావలి జిల్లా కలెక్టరేట్లో పరిశీలించారు. 30 మంది నామినేషన్లను ఆమోదించారు. పదిమంది నామినేషన్లను తిరస్కరించారు. నామినేషన్‌లు ఆమోదించిన వారిలో తెలుగుదేశం పార్టీ నుంచి ఆలపాటి రాజేంద్రప్రసాద్, నేషనల్ నవ క్రాంతి పార్టీ నుంచి కనకం శ్రీనివాసరావు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా అన్నవరపు ఆనంద్ కిషోర్, అరిగెల శివరాం ప్రసాద్, అహ్మద్ షేక్, ఉమర్ బాషా షేక్, ఏమిల్ల వినయ్ కుమార్ తంబి, కందుల వెంకటరావు, గుడిసె రాంబాబు, గుంతకల్లు వెంకటేశ్వర్లు, గుమ్మ శ్రీనివాసరావు, గౌతుకట్ల అంకమ్మరావు, గంగోలు శామ్యూల్, గంటా మమత, జూపూడి శ్యాంప్రసాద్, డేగల సైదా రాజు, ధారా విక్రం, దీపక్ పులుగు, దూకి పట్టి రాధాకృష్ణమూర్తి, బొట్ల శివ సత్యనారాయణ, మూరకొండ చంద్రశేఖర్, మేరిగా మోహన్ రావు, మంత్రి బాలకృష్ణ, యార్లగడ్డ శోభారాణి, రామకోటయ్య మద్దుముల, లగడపాటి వేణుగోపాల్, కేఎస్ లక్ష్మణరావు, శారద తిరువీధుల, సత్యబాల సుందర రామశర్మ చుండూరు ఉన్నారు. ఏర్పాట్లపై అధికారులతో రిటర్నింగ్ అధికారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 4,500 గరిష్టం : రూ. 5,400

మోడల్ ధర రూ. 5,000

క్లుప్తంగా

నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్‌లో బంగారు పతకం సాధించిన లేళ్ల



బాపట్ల: జాతీయ 44వ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో బాపట్లకు చెందిన లేళ్ల వెంకట రామారావు బంగారు పతకం సాధించారు. 87 సంవత్సరాల వెంకట రామారావు రాజస్థాన్‌లో ఈనెల 6,7,8 తేదీల్లో జరిగిన పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. జావెలిన్ త్రోలో బంగారు పతకం, డిస్కస్ త్రో, షార్ట్‌పుట్‌లో కాంస్య పతకాలు సాధించాడు. రాజస్థాన్ జీత్ కౌర్ (ఆర్గనైజింగ్ సెక్రటరీ)చేతులు మీదుగా పతకాలను అందుకున్నారు. ఈయన ఇప్పటివరకు జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొని గోల్డ్ మెడల్స్ 96, సిల్వర్ 40, కాంస్య పతకాలు 20 సాధించారు. వెంకట రామారావును పలువురు మంగళవారం అభినందించారు.

డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా హీరాలాల్ నియామకం



నరసరావుపేట: జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఇన్‌చార్జి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా కె.హీరాలాల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం జిల్లా నీటి యాజమాన్య సంస్థలో ఫైనాన్స్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పథక సంచాలకులుగా బదిలీ అయ్యారు. ఇప్పటివరకు పీడీగా వ్యవహరిస్తున్న బాలూనాయక్‌పై అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేసిన విషయం విధితమే.

తెనాలి మార్గంలో పలు రైళ్లు రద్దు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): గూడూరు-కృష్ణా కెనాల్ జంక్షన్ మధ్యలో మూడో లైన్ నిర్మాణ పనులు, తెనాలి యార్డ్ ఆధునికీకరణ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు ప్యాసెంజర్ రైళ్లను 30 రోజుల పాటు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే పీఆర్‌ఓ నుస్రత్ మండ్రుప్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ-తెనాలి (67221), తెనాలి-రేపల్లె (67231), రేపల్లె-తెనాలి (67332) రైళ్లను ఈ నెల 12 నుంచి మార్చి 13 వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

జీఎంసీ కమిషనర్‌పై విచారణకు వినతి



సంపత్ కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మనోహర్ నాయుడు, భాగ్యలక్ష్మి, సురేష్ బాబు

నెహ్రూనగర్: విజయవాడ నగరంలో బుడమేరు వరద బాధితులకు సహాయం పేరుతో గుంటూరు నగర కమిషనర్ రూ.9.23 కోట్లు దారి మళ్లించారని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కడప మేయర్ కె.సురేష్‌బాబులు మంగళవారం కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌ను కోరారు. సీడీఎంఏ పి.సంపత్ కుమార్‌ను మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బుడమేరు వరదలకు చేసిన ఖర్చు వివరాలు తెలపాలని కౌన్సిల్ సమావేశంలో సభ్యులు అడిగినందుకు సమాధానం తప్పించుకునేందుకు కౌన్సిల్ సమావేశాన్ని తప్పుదోవ పట్టించారని జీఎంసీ కమిషనర్‌పై ఫిర్యాదు చేశారు. కౌన్సిల్ సమావేశం జరగకుండా చేశారని ఆరోపించారు. వరద బాధితులకు దాతలు ఇచ్చిన ఫుడ్ ప్యాకెట్లను తాము ఇచ్చినట్లుగా బిల్లులు పెట్టుకున్నారని పేర్కొన్నారు. అధికారుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.లక్షల్లో జమ అయ్యాయని గుర్తుచేశారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన వ్యక్తుల ఖాతాలకు కూడా నగదు మళ్లించారని ఆరోపించారు. వీటికి సంబంధించిన బ్యాంకు వివరాలను ఇవ్వాలని కోరినప్పటికీ కమిషనర్ స్పందించ లేదన్నారు. సమాధానం చెప్పాల్సిన బాధ్యత కమిషనర్‌పై ఉందన్నారు. తప్పు చేసినందునే కాలయాపన చేశారన్నారు. ఆయన అవినీతిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ప్రజల సొమ్మును తిరిగి కార్పొరేషన్‌కు జమ చేయించాలని వారు కోరారు. త్వరలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీని కలిసి కమిషనర్ బాగోతాన్ని వివరిస్తామన్నారు. అప్పటికీ స్పందించకుంటే న్యాయస్థానం ద్వారా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

రసవత్తరంగా క్రికెట్ పోటీలు



తలపడుతున్న ఆంధ్ర - తెలంగాణ , తమిళనాడు జట్ల క్రీడాకారులు



తమిళనాడు బ్యాటర్ వేదాంత భరద్వాజ్‌ను అభినందిస్తున్న జట్టు సభ్యులు

మంగళగిరి: నగర పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లో ఉన్న ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఐఏ అండ్ ఏడీ సౌత్ జోన్ టోర్నమెంట్‌లో మ్యాచ్‌లు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఆంధ్ర – తెలంగాణ జట్టుపై తమిళనాడు జట్టు ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన తమిళనాడు జట్టు బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర – తెలంగాణ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లు నష్టపోయి 154 పరుగులు చేసింది. బ్యాటర్ ఎస్.కొఠారి 57 బంతులలో 3 సిక్స్‌లు, 7 ఫోర్లతో 77 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మరో బ్యాటర్ తరుణ్ 27 పరుగులు చేశాడు. తమిళనాడు జట్టు బౌలర్లు బాలాజీ, రవితేజలు చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం తమిళనాడు జట్టు 20 ఓవర్లలో 155 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది.

కేరళపై కర్నాటక విజయం

అనంతరం కర్నాటక, కేరళ మ్యాచ్‌లో తొలుత కేరళ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసింది. బ్యాటర్లు సచిన్ 27, శ్యామ్సన్ 24 పరుగులు చేశారు. కర్నాటక బౌలర్లు దర్శన్ 3, అర్జున్ గౌడ్ 2 వికెట్లు తీశారు. కర్నాటక 2 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసి విజయం సాధించింది. కర్నాటక బ్యాటర్ అభిరాత్ రెడ్డి 37 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 50 పరుగులు చేసి రాణించాడు.

బీఓబీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రవీణ్‌కుమార్

చీరాల రూరల్: బ్యాంక్ ఆఫ్ బరోడా హైదరాబాద్ జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా చీరాలకు చెందిన దేవరకొండ ప్రవీణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 10వ తేదీన బ్యాంక్ ఆఫ్ బరోడా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్టణంలో 15వ జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో చినగంజాం మండలం చింతగుంపల్లె గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో పనిచేస్తున్న చీరాలకు చెందిన దేవరకొండ ప్రవీణ్‌కుమార్‌ను ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫ్ బరోడా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ హైదరాబాద్ జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అరకుకు చెందిన జీజేఎంఎల్ కిషోర్ అసోసియేషన్ సెక్రటరీగా భారీ మెజారిటీతో ఎన్నికైనట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వైజాగ్‌కు చెందిన వైకే మధుసూదన్ హైదరాబాద్ జోన్ సెక్రటరీగా ఎన్నికైనట్లు చెప్పారు. మూడు కీలకమైన పదవులు ఏపీకి దక్కడంపై ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ హర్షం వ్యక్తం చేశారు. అత్యున్నతమైన జాతీయ స్థాయి పదవులు ఏపీకి దక్కడం ఇదే ప్రథమమని ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ప్రభుత్వ వైద్యశాల బ్లడ్ బ్యాంక్ తనిఖీ

నరసరావుపేటటౌన్: ప్రభుత్వ వైద్యశాలలోని బ్లడ్ బ్యాంకును ఏపీ శాక్స్ జాయింట్ డైరెక్టర్ ప్రసన్న, అసిస్టెంట్ డైరెక్టర్ వి.బాబురావులు మంగళవారం తనిఖీ చేశారు. బ్లడ్ బ్యాంక్‌లోని సాంకేతిక సిబ్బందిని వివిధ అంశాలపై ప్రశ్నించారు. వారి పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ ఉండగా వైద్యశాలలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఆవశ్యకత ఏంటని ప్రశ్నించారు. ప్రైవేట్ బ్లడ్ బ్యాంకుల వారు నిర్వహించే క్యాంపులలో సేకరించే బ్లడ్ ప్యాకెట్లలో 30శాతం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంటుందని, ఆ విధంగా చేస్తున్నారా లేదా అని సిబ్బందిని ప్రశ్నించారు. ప్రభుత్వ వైద్యశాలలోని వివిధ గ్రూపుల రక్తం లభ్యత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వచ్చినట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.వి.రంగారావు, డాక్టర్ ఏడుకొండలు, ఇతర సిబ్బంది ఉన్నారు.

గార్లపాటికి బంగారు నంది, అబ్దుల్ కలాం పురస్కారం



పురస్కారం అందుకుంటున్న గార్లపాటి దాసు

క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ తెలుగు కళారత్నాలు సాంస్కృతి సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాయ గాన సభవారు 2025 సంవత్సరానికి సంబంధించి జాతీయ బంగారు నంది, అబ్దుల్ కలాం పురస్కారాన్ని క్రోసూరుకు చెందిన ఏపీ ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ మండలి గౌరవ అధ్యక్షుడు గార్లపాటి దాసుకు మంగళవారం అందించారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ సీఈఓ డాక్టర్ యు.వి.రత్నం, డాక్టర్ ధనాసి ఉషారాణి, మద్దిశెట్టి సామేలు చేతుల మీదుగా బంగారు నంది, అబ్దుల్ కలాం పురస్కారంతోపాటు ప్రశంస పత్రాన్ని దాసు అందుకున్నారు. ఈసందర్భంగా దాసు సాక్షితో మాట్లాడుతూ ఈ పురస్కారంతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. తనకు పురస్కారం అందించిన సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాటక రంగ నటుడు, డైరెక్టర్ శిఖా ఆదాం, బిషప్ ముక్తిపూడి సత్య కిరణ్, నన్నెపాగ ప్రశాంతి, సొపాటి ప్రభాకర్ రెడ్డి, రవణమ్మ వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులు అరెస్ట్

రూ.16 లక్షల విలువైన బంగారం, ఇతర సామగ్రి స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ



స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలో నెల వ్యవధిలో జరిగిన రెండు చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం వారిని కోర్టుకు హాజరు పరిచారు. ఈ సందర్భంగా నార్త్‌జోన్ డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ... ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు సీఐ కళ్యాణ్ రాజు, ఎస్సైలు, ఎస్బీ తదితర సిబ్బంది కలిసి పనిచేసి నిందితులను అరెస్ట్ చేశారని చెప్పారు. ఉండవల్లి సెంటర్‌లో ఉపాధ్యాయురాలు శిల్ప ఇంట్లో, బ్యాంకులో పనిచేస్తున్న మల్లికార్జునరావు ఇంట్లో చోరీలు జరిగినట్లు గుర్తుచేశారు. పోలీసుల దర్యాప్తులో కేఎల్ రావు కాలనీకి చెందిన చల్లా నాగరాజును నిందితుడిగా గుర్తించి, అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. విచారించగా బోరా దుర్గారెడ్డితో కలిసి ఈ చోరీలకు అతడు పాల్పడ్డట్లు తెలిసిందన్నారు. రూ.16 లక్షల విలువైన బంగారు, కొంత నగదు, ఫోన్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నాగరాజు చెడు వ్యసనాలకు అలవాటు పడి చోరీకి పాల్పడ్డాడని తెలిపారు. బంగారం కరిగించి విక్రయించగా వచ్చిన సొమ్ముతో యాప్‌లలో బెట్టింగ్‌లు కాసి పోగొట్టుకున్నాడని పేర్కొన్నారు. చల్లా నాగరాజు విజయవాడలో కూడా చోరీకి పాల్పడినట్లు తెలియవచ్చిందని చెప్పారు. వీరిపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేస్తున్నట్లు వెల్లడించారు.

గంజాయిపై సమాచారమివ్వాలి

మంగళగిరి సబ్ డివిజన్‌లో ఎక్కడైనా గంజాయి అమ్మకాలు జరిగినా, సేవిస్తున్నా సమాచారం ఇవ్వాలని కోరారు. ఇప్పటికే పలుమార్లు వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేశామని గుర్తుచేశారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసుల్లో 15 మందిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచామని తెలిపారు. మందుబాబులు బహిరంగంగా మద్యం తాగే ప్రాంతాల్లో రోజూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

డాక్టర్ విజయకు అంతర్జాతీయ అవార్డు



మాట్లాడుతున్న డాక్టర్ పమిడిముక్కల విజయ

గుంటూరు మెడికల్: గుంటూరు లలితా సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్స్‌కు చెందిన సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ అత్యంత ప్రతిష్టాత్మకమైన పాల్ డడ్లీ వైట్ ఇంటర్నేషనల్ స్కాలర్ అవార్డ్‌ను అందుకున్నారు. ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ ఫిబ్రవరి 5 నుంచి 7 వ తేదీ వరకు లాస్ ఏంజెల్స్‌లో ఇంటర్నేషనల్ స్ట్రోక్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అంతర్జాతీయ సదస్సులో ఆహ్వానిత స్పీకర్‌గా హాజరైన ఆమె 'భారతదేశంలో స్ట్రోక్ సేవల పురోగతి, నాణ్యమైన చికిత్స, ఉత్తమ పద్ధతులు, కొత్త విధానాలు' అనే అంశంపై ప్రసంగించారు. ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్, అమెరికన్ స్ట్రోక్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ సింపోజియంలో దేశంలో ప్రామాణిక స్ట్రోక్ సంరక్షణ విధానాలు ,అక్రెడిటేషన్ ప్రక్రియలు పక్షవాత పేషెంట్లకు ఎలా మెరుగైన ఫలితాలను సాధించగలవో వివరించారు. అంతర్జాతీయ సహకారంతో ఎక్యూట్ స్ట్రోక్ మేనేజ్ మెంట్‌పై డాక్టర్ విజయ పంపిన ఒరిజినల్ పరిశోధనా పత్రానికి 2025లో అత్యధిక స్థాయి ర్యాంకు గుర్తింపు పొంది ప్రతిష్టాత్మక పాల్ డడ్లీ వైట్ ఇంటర్నేషనల్ స్కాలర్ అవార్డ్‌ను అందుకున్నారు.

గిట్టుబాటు ధర కోసం మిర్చి రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మిర్చి రైతులు

కొరిటిపాడు(గుంటూరు): మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి రైతులు మంగళవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులను నిలువునా ముంచుతున్నారని నినాదాలు చేశారు. ఎకరా మిర్చి పంట సాగుకు లక్షల రూపాయలు ఖర్చు చేసి, పండించిన మిర్చిని యార్డుకు తీసుకువస్తే ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. గత ఏడాది క్వింటా మిర్చికి రూ.20 వేలు నుంచి రూ.26 వేలు పలికిన ధరలు నేడు రూ.13 వేలు కూడా పలకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని, ఈ ఏడాది తామర తెగులు, వాతావరణంలో మార్పుల కారణంగా 15 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితులు లేవన్నారు. ధరలు పతనం కాకుండా చూడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని అదనంగా బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇవే ధరలు కొనసాగితే మిర్చి రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు అర్ధగంట పాటు రోడ్డుపై బైటాయించి, ఆందోళన చేశారు.

జీజీహెచ్‌లో అరుదైన గుండె శస్త్రచికిత్సలు



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ నాతాని శ్రీకాంత్, పక్కన డాక్టర్ రమణ యశస్వి, ఇతర వైద్యులు

గుంటూరు మెడికల్: గుండెపోటుకు గురై ప్రాణాపాయస్థితిలో చికిత్స కోసం వచ్చిన ఇరువురు మహిళలకు అత్యాధునిక పద్ధతుల్లో అరుదైన ఆపరేషన్‌లు చేసి ప్రాణాలు కాపాడినట్లు గుంటూరు జీజీహెచ్ కార్డియాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ నాతాని శ్రీకాంత్ చెప్పారు. మంగళవారం జీజీహెచ్ గుండె జబ్బుల వైద్య విభాగంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆపరేషన్ వివరాలు వెల్లడించారు. కృష్ణా జిల్లాకు చెందిన కుమారి, గుంటూరు జిల్లాకు చెందిన ప్రభావతిలు గుండెపోటుతో గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చారన్నారు. రక్త నాళాలలో కాల్షియం ఏర్పడి మూసుకుపోయిన విషయాన్ని గుర్తించామన్నారు. రోటాబ్లేషన్, ఇంట్రా వ్యాస్కులర్ అల్ట్రా సౌండ్ పద్ధతిని ఉపయోగించి రక్తనాళాలను శుభ్రం చేసి రక్త ప్రసరణ జరిగే విధంగా చేసి రోగుల ప్రాణాలను కాపాడామని చెప్పారు. ఆస్పత్రిలో ఈ వ్యవహారాలకు ఇదే ప్రథమం అని డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఎన్‌టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా జీజీహెచ్‌లో ఆపరేషన్లు చేసినట్లు వెల్లడించారు. గుంటూరు జీజీహెచ్‌లో అత్యాధునిక వైద్య సౌకర్యాలు ఉన్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ చెప్పారు. కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా అన్ని వైద్య విభాగాల్లో ఆపరేషన్లు చేస్తున్నారని తెలిపారు. వైద్యులను డాక్టర్ రమణ అభినందించారు. ఇరువురు మహిళల్ని మంగళవారం ఆస్పత్రి నుండి డిశ్చార్జి చేశారు. కార్యక్రమంలో కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ బుచ్చి బాబు, డాక్టర్ శివ శంకర్ పాల్గొన్నారు.

పది, ఇంటర్ పరీక్షల్లో సత్తా చాటాలి

- ఏపీ మోడల్ స్కూల్స్ జేడీ తాహెరా సుల్తానా
- పల్నాడు, బాపట్ల జిల్లాల ప్రిన్సిపాళ్లతో విద్యాపరమైన అంశాలపై సమీక్ష



చిరుమామిళ్ల ఏపీ మోడల్ పాఠశాలలో సమీక్షలో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ తాహెరా సుల్తానా

నాదెండ్ల: త్వరలో జరగబోయే పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు సత్తాచాటి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ తాహెరా సుల్తానా చెప్పారు. పల్నాడు జిల్లా చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో పల్నాడు – బాపట్ల జిల్లాలకు సంబంధించిన ప్రిన్సిపాళ్లతో అకడమిక్ రివ్యూ నిర్వహించారు. రెండు జిల్లాలకు సంబంధించి 15 మంది ప్రిన్సిపాళ్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరో నెలరోజుల్లో పరీక్షలు జరగనున్నందున ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు విద్యార్థుల చదువుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అదనపు పౌష్టికాహారం ఇస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాసేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు తలెత్తే సమస్యలను నివృత్తి చేసేందుకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలని సూచించారు. రాష్ట్రంలో అన్ని పాఠశాలలతో పాటూ రెండు జిల్లాలు పోటీపడేలా మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో చిరుమామిళ్ల ప్రిన్సిపాల్ ఝాన్సీవాణి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్



చీరాల: నాటుసారా విక్రయాలు సాగిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. చీరాల మండలం తోటవారిపాలేనికి చెందిన సముద్రాల శాంతి, గండి గోపి అనే ఇద్దరు నాటు సారా అమ్ముతున్నారనే సమాచారం మేరకు వారిని అరెస్ట్ చేశారు. 18 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా అమ్మేవారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, సారా నియంత్రణ కోసం జిల్లాలో పలు బృందాలు తిరుగుతున్నాయని హెచ్చరించారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ రీసర్వే రికార్డులు పరిశీలన



వరహాపురం గ్రామంలో భూ రీసర్వే రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ రామలక్ష్మి

వేమూరు: భూ రీసర్వేల్లో అవకతవకలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మి హెచ్చరించారు. వేమూరు మండలం వరహాపురం గ్రామ సచివాలయంలో భూ రీసర్వే రికార్డులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో రెండో విడత భూ రీసర్వే చేస్తున్నట్లు తెలిపారు. పొలాల్లో ఎలాంటి తప్పులు ఉన్నా వాటిని సరి చేయనున్నట్లు తెలిపారు. హద్దులు గుర్తించి రాళ్లు వేయనున్నట్లు తెలిపారు. వేమూరు మండలం వరహాపురం గ్రామంలో, చుండూరు మండలం మండూరు, అమర్తలూరు మండలం కోడితాడిపర్రు, కొల్లూరు మండలం చినపులివర్రు గ్రామం, భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామాల్లో సర్వే చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మార్కెట్ యార్డులో ఎఫ్‌పీ షాపులు, మాల్స్ పాయింట్‌లు తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు సుశీల, డిప్యూటీ తహసీల్దారు రవీంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

ద్విచక్ర వాహన చోదకుడికి గాయాలు, సమయస్ఫూర్తిగా వ్యవహరించిన డ్రైవర్



రామాంజనేయపురం వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

బల్లికురవ: కట్టెల లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌కు బైకు అడ్డురాగా.. డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయటంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటన మంగళవారం రాత్రి నార్కెట్‌పల్లి- మేదరమెట్ల నామ్ రహదారి పై మండలంలోని రామాంజనేయపుర సమీపంలో జరిగింది. ఈ ఘటనలో బైకు నడుపుతున్న వ్యక్తి గాయాల పాలయ్యాడు. ఏల్చూరు నుంచి అద్దంకిలోని కట్టెల అడితికి వేప కట్టెలు తరలిస్తుండగా రామాంజనేయపురం వద్ద బైకు అడ్డురావటంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. ట్రాక్టర్ బోల్తా కొట్టటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బల్లికురవ పోలీసులు క్రేన్‌తో ట్రాక్టర్‌ను పక్కకు తీసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ఘనంగా తిరుపతమ్మ, గోపయ్య స్వామి కల్యాణం



నరసరావుపేటరూరల్: రావిపాడు గ్రామంలోని లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వామి, అంకమ్మ తల్లి ఆలయ 16వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. సాయంత్రం లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి వార్ల కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్నప్రసాద వితరణ గావించారు. కొత్త వెంకటేశ్వర్లు, పార్వతి, శ్రీ వాసవి మిత్ర మండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, వెంకట సూర్యకుమారి, పొలిశెట్టి సతీష్ పాల్గొన్నారు.